నేటి నుంచి శ్రీప్రకాష్‌లో టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

సిబిఎస్ఇ క్లస్టర్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ -2024 పోటీలు నేటి నుంచి స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో ప్రారంభం అవుతాయని స్కూల్ డైరెక్టర్, ఏపి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్.విజయ్‌ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల పరిధిలోని 50 సిబిఎస్ఇ పాఠశాలల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. వివిధ కేటగిరీలలో సుమారు 12 విభాగాలలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీలను జెఎన్‌టియు ఫిజికల్ డైరెక్టర్ అనూరాధ పర్యవేక్షిస్తారని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలను ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

గుడ్డు అధరహో

- రిటైల్ ధర రూ.7, రైతు ధర రూ.5
- కొత్త బ్యాచ్‌లు వేయకపోవడంతో పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గుడ్డు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. రిటైల్ మార్కెట్లో రూ.7 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. కోడి గుడ్డు ధరలు కూడా కొండెక్కడంతో కొనుగోలుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది ఇదే సీజన్‌లో కోడిగుడ్డు ధర రూ.6 కాగా ప్రస్తుతం అది రూ.7 చేరింది. రెండేళ్లుగా పౌల్ట్రీ పరిశ్రమ నష్టాలలో ఉండటంతో రైతులు కొత్త బ్యాచ్‌లు వేయలేదు. దీంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. రైతుల నుంచి రూ.5లకు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పౌల్ట్రీ పరిశ్రమ గత నాలుగేళ్లుగా నష్టాల్లో ఉంది. గత నెలలోనూ కోడి గుడ్డు హోల్ సేల్ కేవలం రూ.3.50 మాత్రమే పలికింది. ప్రస్తుతం పెరుగుదుల ఊరటనివ్వగా కొనుగోలు దారులకు మాత్రం చుక్కలు కన్పిస్తున్నాయి. 2017లో గుడ్డు ధర రికార్డు స్థాయిలో రూ.5.45కి చేరింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయం తరువాత పెద్ద

పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీ ఫారాలు ఉండగా, దాదాపు 1.40 కోట్ల కోళ్ల పెంపకం అవుతోంది. 1.10 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. 40 శాతం మేర గుడ్లు స్థానిక మార్కెట్లలో వినియోగిస్తుండగా 60 శాతం గుడ్లు ఈశాన్య రాష్ట్రాలైన ఒడిశా, బీహార్ బెంగాల్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. అయితే కనీసం రూ.6 రైతులకు లభిస్తే నష్టాల నుంచి కొంతమేర కోలుకోగలమని రైతులు చెబుతున్నారు.

గుడ్డు ఉత్పత్తికి రూ.5 వెచ్చిస్తున్నట్లు వివరించారు. కోళ్లకు వినియోగించే మేత, దాణా ఖర్చులు ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగాయి. మొక్కజొన్న, సోయా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18వేల నుంచి రూ.25వేలు, సోయా రూ.50వేల నుంచి రూ.80వేలకు పెరిగింది. గుడ్లు పెట్టే కోళ్లను ఆరు నెలల పెంపకం అనంతరం మరో ఆరు నెలలు గుడ్ల ఉత్పత్తి జరుగుతుంది. ఏడాది అనంతరం కొత్త బ్యాచ్‌లు వేయటం పరిపాటి. ఈ ఏడాది జనవరిలో కొత్త బ్యాచ్‌లు వేయకపోవటం, గత ఏడాది వేసిన బ్యాచ్‌లను మే నెలలో కోతకు తరలించడంతో గుడ్లు పెట్టే కోళ్ల కొరత నెలకొంది. నల్లజర్ల మండలంలో సుమారు 10 లక్షల పౌల్ట్రీ ఉండగా ప్రస్తుతం 6లక్షలకు మించి కోళ్లు లేవు. దీంతో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. కొత్త బ్యాచ్‌లు వేయకపోవటానికి నష్టాలే కారణమని రైతులు వాపోతున్నారు. 2019కి పూర్వం దాణా రేటు తక్కువగా ఉండటంతో ఖర్చు తగ్గి రైతులు లాభాలు పొందారు. గడిచిన నాలుగేళ్లలో దాణా, ఇతర ఖర్చులు రెండింతలు పెరగడంతో నష్టాలు చవిచూస్తున్నారు. మరోవైపు ఇక్కడి గుడ్డు ఎగుమతులు జరిగే ఈశాన్య రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, యూపీ, కోల్‌కత్తా వంటి రాష్ట్రాలలో అక్కడి ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. సబ్సిడీలు, రాయితీలు కల్పిస్తున్నాయి. దీంతో కొన్నిసార్లు స్థానిక మార్కెట్‌పైనే ఆధార పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో గత రెండేళ్ల నుంచి కోళ్ల ఫారాల్లో నష్టాల కారణంగా కొత్త బ్యాచ్‌లు వేయటంలేదు. పాతకోళ్లతోనే నడుస్తున్నందున తాజాగా పెరుగుదలకు ఒక కారణమని తెలుస్తోంది.

కనీసం రూ.6 చెల్లిస్తేనే గిట్టుబాటు

గత వారంలోనూ గుడ్డు రైతు ధర రూ.3.50 మించలేదు. మేలో పాత బ్యాచ్‌లు తీసేయడంతో డిమాండ్ నెలకొంది. దీంతో వ్యాపారులు రూ.5 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. కోడిగుడ్డుకు నికరంగా రూ.6 చెల్లిస్తే గిట్టుబాటు అవుతుంది. మేత ధరలు, విద్యుత్ బిల్లుల పెట్టుబడి ఖర్చు కారణంగా ఉత్పత్తి ఖర్చు రూ.5కు చేరింది. మార్కెట్లో ధరలు లేక పౌల్ట్రీ రైతులు పూర్తిగా నష్టాలపాలవుతున్నారు.

- కె. రామారావు పౌల్ట్రీ రైతు, అనపర్తి, తూ.గో జిల్లా

ప్రణాళికాబద్ధంగా ధాన్యం సేకరణ : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో 2024-25 ఖరీఫ్ సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు అనుసరించాల్సిన విధానాలపై జెసి రాహుల్‌మీనా, ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా, ధాన్యం సేకరణ కేంద్రాలు, సివిల్ సప్లై, కనీస మద్దతు ధర వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ఇందుకు రెవెన్యూ, వ్యవసాయం, పౌర సరఫరాలు, మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్ట్ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ ఖరీఫ్ సీజన్లో 5.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనాకు గాను, స్థానిక వినియోగం నిమిత్తం 1.04 లక్షల మెట్రిక్ టన్నులు పోను సుమారు 4.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు రానుందని తెలిపారు. ఇందులో మిల్లర్ల ద్వారా సుమారుగా 1.40 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయనుండగా, మిగిలిన 2.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా సేకరించవలసి ఉంటుందని వివరించారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320 (75 కేజీలకు రూ.1,740), సాధారణ రకం క్వింటాకు రూ.2,300 (75 కేజీలకు రూ.1,725)లుగా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

ప్రజాస్వామ్య ప్రగతికి వారధి ఏచూరి..

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజాస్వామ్య ప్రగతికి వారధిగా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని పలువురు కొనియాడారు. గురువారం స్థానిక రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో ఏచూరి సంస్మరణ సభ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. తొలుతగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుకె వైస్ ఛాన్సలర్ మురళీకృష్ణ, ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్, ప్రముఖ రచయిత గొడవర్తి సత్యమూర్తి, వివిధ రాజకీయ, ప్రజాసంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీతారాం ఏచూరి జాతీయ సమగ్రతకు ప్రతీకగా, ప్రజాస్వామ్య ప్రగతికి వారధిగా నిలిచారని కొనియాడారు. సీతారాం కాంస్య విగ్రహాన్ని పార్లమెంట్ హాలులో ఏర్పాటు చేసి, కాకినాడ జిల్లాలో నెలకొల్పే విమానాశ్రయానికి నామకరణం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ సభ తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు, కో కన్వీనర్ చింతపల్లి అజయ్‌కుమార్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బీరక చంద్రశేఖర్, మాజీ మేయర్లు సుంకర పావని, సుంకర శివ ప్రసన్న, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు మోర్తా రాజశేఖర్, దువ్వా శేషబాబ్జి, జె.వెంకటేశ్వర్లు, తాటిపాక మధు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, మండా బేబీరాణి, పెద్దింశెట్టి రామకృష్ణ, టి రాజా, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పౌర సమాజం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కోటనందూరు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సిడిపిఒ కె.శ్రీలత అన్నారు. గురువారం పట్టణంలోని రాజీవ్ కల్ప, తేటగుంట గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జాతీయ పౌష్టికాహార మహోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తెలుసు కోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు సిడిపిఒ నిహారిక, సూపర్‌వైజర్ సరస్వతి, విజయ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసిడిఎస్ అధికారులు

ఉల్లి కషాయంతో ఎండు తెగుల నివారణ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

వరిని ఆశించే ఎండు తెగులు నివారణకు ఉల్లి కషాయం దివ్య ఔషధం అని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి అన్నారు. గురువారం సిరిపురంలో పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రయోగాత్మకంగా ఉల్లి కషాయం తయారీ విధానాన్ని ఆమె రైతులకు వివరించారు. ఇటీవల వర్షాలకు ఉష్ణోగ్రత 22-26 సెంటిగ్రేట్‌కు రావడం, నీరు అధికంగా ఒక పొలం నుంచి ఒక పొలంలోకి మారడం వలన తెగులు వ్యాపిస్తుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ఉల్లి కషాయం తయారు చేసుకుని వాడుకోవాలన్నారు. కషాయం తయారీకి 100 లీటర్ల నీళ్లు, 20 కేజీల దంచిన ఉల్లిపాయలు, 1 కేజీ వెల్లుల్లి, రెండు కేజీల వేపాకు ముద్ద, 1/2 కేజీ పచ్చిమిర్చి ముద్ద, 1/2 కేజీ పొగాకు కాడలు, ఉక్కో కేజీ చొప్పున మారేడు ఆకు, జామాకు, సీతాఫలం ఆకు, గానుగాకు, జిల్లేడు ఆకు దంచిన మొదలు ఒక దగ్గర చేర్చుకోవాలన్నారు. పొయ్యి మీద నీరు పెట్టి పైన తెలిపిన మిశ్రమాలన్నీ 5 పొంగులు వచ్చేవరకూ కలుపుకోవాలన్నారు. తదుపరి 5 లీటర్ల ఉల్లి కాషాయానికి 5 లీటర్ల ఆవు మూత్రంతో కలుపుకుని పది ట్యాంకులు చొప్పున పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - కాజులూరు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని కాజులూరు జడ్‌పి పాఠశాల హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 17 ఫుట్‌బాల్ విభాగంలో తమ విద్యార్థులు దండంగి శ్రీవల్లి, గుబ్బల అనూష, యాళ్ళ వర్షా, ఫాల్గుణ దేవి ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. ఈ నెల 29 నుంచి గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటుకునేలా శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రవి సుందర కౌరు, మూర్తి, నాగ లక్ష్మిలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్ఎంసి ఛైర్మన్ పద్దరాజు, ఉపాధ్యాయులు జెఎస్.బెన్హర్, సత్యనా రాయణ, హరినాథ్ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లాకు, మండలానికి, గ్రామానికి మంచి పేరుత తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

త్వరలో వినియోగంలోకి క్లాప్ వాహనాలు

సిఐటియు నాయకులకు ఎంహెచ్ఒ హామీ

ప్రజాశక్తి - కాకినాడ

త్వరలోనే క్లాప్ వాహనాలను వినియోగంలోకి తీసుకొస్తామని ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్ హామీ ఇచ్చారు. గురువారం నగర పాలక సంస్థ పరిధిలో గల క్లాప్ వాహనాల నడిపించాలని, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్లు కమిషనర్‌ను కలిసేందుకు వచ్చారు. ఆ సమయానికి కమిషనర్ లేకపోవడంతో సిఐటియు నాయకులు వచ్చిన సమాచారం ఎంఎహెచ్ఒకు కమిషనర్ సిబ్బంది తెలియచేశారు. దీంతో ఎంహెచ్ఒ సిఐటియు నాయకుడు పలివెల వీరబాబుకు చరవాణి ద్వారా మాట్లాడారు. క్లాప్ వాహన కాంట్రాక్టర్స్‌కి అర్బన్ లోకల్ బాడీస్ ద్వారా బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని, వాహనాలను త్వరలోనే వర్కింగ్ లోకి తీసుకుని వస్తామని, డ్రైవర్స్ ఆందోళన చెందనవసరం లేదని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ క్లాప్ వాహనాలు ప్రతి నిత్యం నగరంలో తడిచెత్త పొడిచెత్త సేకరణలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. క్లాప్ వాహన డ్రైవర్స్‌కి కనీస వేతనాలు అమలు కాకపోయినా, జీతాలు సకాలంలో అందకపోయినా, నగర పాలక సంస్థ మీద నమ్మకంతో, ఎప్పటికైనా మంచి జరుగుతుందనే ఆశతో విధులు కొనసాగిస్తున్నారని అన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 4 రోజులపాటు 34 పెట్రోల్ వాహనాలు నిలిపి వేశారని, 5 వ తేదీ నుంచి 75 గ్యాస్ వాహనాలు నిలిపి వేయడం జరిగిందన్నారు. తమకు జనవరి నుంచి బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టు సంస్థ చెబుతుందని, ప్రభుత్వం స్పందించి క్లాప్ వాహనాలు నడిపించాలని కోరుతున్నామన్నారు. క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ తమ ఉపాధి కొనసాగే విధంగా ప్రభుత్వం, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంహెచ్ఒ స్పందన పట్ల సిఐటియు క్లాప్ వాహన డ్రైవర్స్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు భద్ర, కొండబాబు, శివశంకర్, గంగాధర్, శ్రీనివాస్, సంతోష్, విక్టర్, పూర్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

పాఠశాలకు కుర్చీలు, టేబుల్స్ బహూకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రాజీవ్ కాలనీలోని మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలకు గురువారం మిషన్ అన్నపూర్ణ సహాయనిధి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతలు కుర్చీలు, టేబుల్ బహూకరించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి సూరే వేణు తన తండ్రి సూరే సుబ్బారావు జ్ఞాపకార్థం హెచ్ఎం బి.రమాదేవికి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధా శ్రీనివాస్, కె.సునీత, ఉపాధ్యాయులు డి.యశోద పద్మ, సత్య, ఎస్ జానకి, యు.అర్జున్, ఆర్.అనిల్‌కుమార్, జివివి.సత్యనారాయణ, ఎస్ఎంసి సభ్యులు సిహెచ్ కామాక్షి, కొమ్ముజు లక్ష్మి, రత్నం పాల్గొన్నారు.

కుర్చీలు, టేబుల్‌ను అందచేస్తున్న దాతలు

22న మరిడమ్మ తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిధిలోని కోరంగి పంచాయతీ సీతారామపురం మరిడమ్మ తీర్థం ఈనెల 22న నిర్వహించనున్నట్లు దేవస్థానం ఛైర్మన్ టేకుమూడి లక్ష్మణరావు తెలిపారు. ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తీర్థ మహోత్సవాల్లో భాగంగా 21వ తేదీ శనివారం మరిడమ్మ జాగారం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట, తాళ్లరేవు

స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్ఎన్‌డి.ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తపేట, కోట బజార్, పాత తహశీల్దార్ కార్యాలయం, ఆఫీస్, కుమ్మర వీధి, బలుసులపేట, సంత మార్కెట్, పెన్షన్ లైన్, మెహర్ కాంప్లెక్స్, హెడ్ పోస్ట్ ఆఫీస్ వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. అలాగు తాళ్ళరేవు, చొల్లంగి సబ్ స్టేషన్ల పరిధిలో మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ కాకినాడ ఇఇ ఎన్.ఉదయభాస్కర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మల్లవరం, జార్జిపేట, పోలేకుర్రు పంచాయతీల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు, కోరంగి, చొల్లంగి, చొల్లంగిపేట, జి. వేమవరం, కొత్తూరు, రామన్నపాలెం, పటవవల, శాంతమూల గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయము కలుగుతుందన్నారు.

నేడు, రేపు స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఈనెల 20, 21వ తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాకారులు ఎంపికకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు శివరామ కృష్ణయ్య, పుల్లయ్య, మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎం.వెంకటేశ్వర్లు వెల్లడించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ 20వ తేదీన బాలురకుకు, 21న బాలికలకు వాలీబాల్, కబడ్డీ, కో.కో, బ్యాట్మెంటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి వాటిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీలను శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతాయని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొనవచ్చునని చెప్పారు.

రిలయన్స్ స్కాలర్‌షిప్‌లపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేస్తున్న స్కాలర్‌షిప్‌లపై స్థానిక మహారాణి కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిం చారు. గురువారం జరిగిన ఈ సదస్సు ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రూ.50 వేలు చొప్పున నాలుగేళ్లపాటు అందజేసే ఈ స్కాలర్‌షిప్‌లపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఇంటర్లో 60 శాతం మార్కులు వచ్చి వార్షికాదాయం రూ.2.50 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉండవచ్చన్నారు. అయితే ఆదాయం రూ.2.50 లక్షల కంటే దిగువ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రీ నెంబర్ 18004198800ను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ సదస్సులో అధ్యాపకులు ఎ.సత్యనారాయణ, ఎస్.మనీషాకుమారి, ఎం.తాతాజీ, రిలయన్స్ ప్రోగ్రాం సపోర్టర్ యు.రమేష్‌బాబు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న రిలయన్స్ మేనేజర్ నాగేశ్వరరావు

హుండీల ఆదాయం రూ.19.31 లక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయ హుండీల ద్వారా రూ.19.31 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస రావు తెలిపారు. 79 రోజులకు సంబంధించి మామూలు హుండీల ద్వారా రూ.13,12,116, అన్నదాన హుండీల ద్వారా రూ.6,19,580 ఆదాయం సమకూరిందన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి, మరిడమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ మోహనరావు, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ఉదయబాబునాయుడు, తిరుపతి సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బి.మాధురిల సమక్షంలో హుండీల్లో ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.



హుండీని తెరుస్తున్న ఆలయ అధికారులు

కార్టూ'నిజం'



మురుగులో ప్రజా పరిషత్ కార్యాలయం

నాచు పట్టేసిన మండల పరిషత్ కార్యాలయం పరిసర ప్రాంతం

ప్రజాశక్తి - జగ్గంపేట

ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకూ స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాలను ఎంతో ఆర్భాటంగా ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామాల్లో పరిశుభ్రత ఉండాలని, ప్రజలంతా భాగస్వాములు కావాలని అధికార యంత్రాంగం ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఈ నేపథ్యంలోనే స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట మురుగు దర్శనమిస్తుంది. అయినా ఈ కార్యాలయాన్ని పట్టించుకోరా? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. కార్యాలయం చుట్టూ ఉన్న ఇళ్లు, దుకాణాల వారు వినియోగించిన నీరు బయటకు పోయేందుకు డ్రెయినేజీ లేకపోవడంతో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట మురుగుకూపంగా మారింది. ఆ మురుగులోనే అధికారులు, నాయకులు వెళ్తున్నారే తప్ప మురుగు నివారణ చర్యలు చేపట్టడం లేదని పలువురు విమర్శస్తున్నారు. నిత్యం ఈ కార్యాలయానికి వందల సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. మురుగు వల్ల దోమలు, ఈగలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రజలను వివిధ రకాల జ్వరాలు వెంటాడటంతో ప్రజలు ఆసుపత్రుల పాలౌతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయం వద్ద ఉన్న మురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫార్మసీ విద్యార్థులకు సిపిఆర్‌పై శిక్షణ

విద్యార్థులకు వివరిస్తున్న మెడికవర్ హాస్పిటల్ వైద్యులు ప్రకాష్

ప్రజాశక్తి - తాళ్లరేవు

గుండెకు సంబంధించి ప్రమాదకర పరిస్థితిలో రోగి ఉన్నప్పుడు ప్రాథమికంగా చేయాల్సిన సిపిఆర్ విధానంపై విద్యార్థులకు శిక్షణను ఇచ్చారు. గురువారం కోరింగ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో కాకినాడ మెడికవర్ హాస్పిటల్ వైద్యుల సిపిఆర్ చేసే విధానంపై డెమో చేసి వివరించారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి విజెసిహెచ్.ప్రకాష్ అత్యవసరంగా ఏదైనా హృదయ సమస్య ఎదురైనప్పుడు సిపిఆర్ చేయడం ద్వారా మనిషిని ఎలా రక్షించాలి, ఏవిధంగా చర్యలు చేపట్టాలి అనే అంశాలపై విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సువర్ణజ్యోతి, కళాశాల డైరక్టర్ సిహెచ్.కల్కిమూర్తి, సెక్రటరీ పి.కనకరాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.గోవిందరావు, మెడికవర్ హస్పటల్స్ మేనేజర్ అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు.

అశోక్‌కుమార్ నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి - కరప

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా వివిధ సంఘాల చేపడుతున్న ఉద్యమాల జెఎసి అధ్యక్షులు పివి రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పండు అశోక్ కుమార్ నియామకం పట్ల జిల్లా ట్రెజరర్ వారా జార్జిరాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల అంబేద్కర్ యువజన సేవా సంఘం, మాల మహానాడు ఆధ్వర్యంలో సమావేశం జరగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదమ్ములుగా ఉండే మాల, మాదిగలను విడదీయడానికి రాజకీయ పార్టీలు ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు మొక్కన అశోక్‌కుమార్, పురం ప్రసాద్, కడెం వెంకటరమణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అగ్ని ప్రమాద బాధితురాలు మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కాట్రావులపల్లి గ్రామానికి చెందిన గంధం అమ్మాజీ (74) ఈనెల 14న ఇంటిలో టీ పెట్టేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించే క్రమంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాటి నుంచి చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి మృతి చెందిందని, ఆమె కుమారుడు గంధం నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ నూకరాజు తెలిపారు.

30 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఇద్దరు మైనర్ల నుంచి 30 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎస్‌పి డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నార్త్ జోన్ డిఎస్‌పి కడలి వెంకటేశ్వరరావు, కోరుకొండ సిఐ సత్య కిషోర్ పర్యవేక్షణలో గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. గోకవరం ఆర్‌టిసి కాంప్లెక్స్ పక్కన ఒడిశా రాష్ట్రం మల్కాజ్‌నగర్‌కు చెందిన ఇద్దర బాలికలు రెండు బ్యాగులతో కనిపించారు. వారిని విచారించగా బ్యాగుల్లో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. మైనర్లను అదుపులోకి తీసుకుని 30.680కేజీల గంజాయిని, ఒక సెల్ ఫోన్, రూ.1,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.1,53,400 ఉంటుందని తెలిపారు. మైనర్లను జువనైల్ హోమ్‌కు తరలిస్తామని ఎస్ఐ తెలిపారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని భీమవరపుకోట గ్రామ పరిధిలో బుధవారం జరిగిన యువకుడి హత్యా సంఘటన ప్రాంతాన్ని డిఎస్‌పి కె.మాధవీలత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ డాగ్స్ స్క్వాడ్, క్లూస్ టీమ్స్ సేకరించిన ఆధారాలను అనుసరించి నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని అన్నారు. ఈ పర్యటనలో తుని సిఐ జి.చెన్న కేశవరావు, ఎస్ఐ టి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయ భూముల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఆలయ భూములు, ప్రభుత్వ భూముల పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మేడిశెట్టి ఇజ్రాయిల్ వ్యాఖ్యానించారు. ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయ భూములను, ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతము కాకుండా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భీమేశ్వర స్వామి దేవస్థానం భూమిపై అవసరమైతే గౌరవ హైకోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు. స్వామి వారి ఆదాయానికి కొదవలేన్నారు. స్వామివారి అన్నయ్య పేట మధ్యలో ఉన్న సర్వే నెంబర్ 13లో 1:47 ఎకరాల పంట భూమి ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు తన రాజకీయ పలుకుబడితో అధికారులను వాడుకుని సుమారు రూ.5 కోట్ల విలువ చేసే భూమిని కేవలం రూ.4.20లక్షలకే తన అనుచరులకు ఇప్పించుకున్నారని అన్నారు. తరువాత కాపు కళ్యాణ మండపం కడతానని తమ పేరు మీద రాయించుకుని ఇప్పుడు వాస్తు బాగోలేదని రకరకాల కారణాలు చెప్పి ఇళ్ల స్థలాలుగా డివైడ్ చేసి అమ్ముకోవడాన్ని, అలాగే చట్టాలలో ఉన్న కొన్ని లుపోల్స్ ఉపయోగించుకుని ద్రాక్షారామ బస్టాండ్ సంబంధించి లీజుకు తీసుకునిప్రయాణికులు రాకపోకులకు ఇబ్బందికరంగా నిబంధనలకు విరుద్ధంగా షాపింగ్ కాంప్లెక్స్ కట్టడాన్ని ఇజ్రాయిల్ తీవ్రంగా ఖండించారు. దీనిపై సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కార్మిక శాఖ మంత్రి సుభాష్ సమగ్ర విచారణ జరిపించి ఆ భూములను ప్రభుత్వానికి చెందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు, ఆలయ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడవలసిన బాధ్యత ప్రజల మీద కూడా ఉందన్నారు.

ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా బాపూజీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులుగా మద్దాల బాపూజీ ఎన్నికైనట్లు ఆయన తెలియజేశారు. అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో గళ గోదావరి భవన్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కాశీభట్ల రామసూర్యనారాయణ ముఖ్య అతిధులుగా పాల్గున్న జిల్లా సమావేశం లో 22 ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు ఈ సభలో పాల్గొన్న ఇట్లు ఆయన వివరించారు. అన్ని సంఘాలు బాపూజీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలియజేశారు. ఉద్యోగుల ప్రతినిధిగా అందరి సమస్యలు పరిష్కారానికి కషి చేస్తానని బాపూజీ హామీ ఇచ్చారు. తనకు అన్ని విధాలా సహకరించిన రామచంద్రపురం తహశీల్దార్ వెంకటేశ్వరరావు కు ఇతర సంఘ పెద్దలకు ఆయన కతజ్ఞతలు తెలిపారు.

మద్యం షాపులకు అనుమతి ఇవ్వొద్దని వినతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో వేణుగోపాలస్వామి గుడి వీధిలోను, మార్కెట్ స్ట్రీట్ రామాలయం మొదలుకొని అన్నపూర్ణ థియేటం మధ్యలో మద్యం షాపులకు అనుమతి ఇవ్వద్దని ఉమ్మడి కూటమి నాయకులు గురువారం రామచంద్రపురం ఆర్‌డిఒ సుధాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో దుకాణాలలో మద్యం నూతన విధానంలో మద్యం షాపులకు అనుమతి ఇవ్వడం వల్ల యాత్రికులకు, మార్కెట్కు వచ్చే వినియోగదారులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని వారు వివరించారు. నిత్యం రద్దీగా ఉండే ఆలయాలు మార్కెట్ ప్రాంతంలో మందుబాబులు ఆగడాలు వల్ల మహిళలకు ఇబ్బందులు ఎదురవుతాయని వారు తెలిపారు. వినతి పత్రంపై ఆర్‌డిఒ వెంటనే స్పందించి ఆయా డిపార్ట్మెంట్ల ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

స్టేషన్ వద్ద మానవహారంగా ఏర్పడిన ప్రతిజ్ఞ చేస్తున్న రైల్వే ఉద్యోగులు, సిబ్బంది

పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తాం

ప్రజాశక్తి - కాకినాడ, సామర్లకోట

దేశాన్ని పరిశుభ్రంగా ఉంచితే భారత మాతకు సేవ చేసినట్టేనని కాకినాడ నగరపాలక సంస్థ మేనేజర్ కె.సత్యనారాయణ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజు గురువారం కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది, సచివాలయాల సిబ్బంది నగరంలో ర్యాలీ చేశారు. పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలంటూ నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. నగరంలోని పలు డివిజన్లలో సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ నగరాన్ని స్వచ్ఛంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. అలాగే స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం సామర్లకోట రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాలు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ప్లాస్టిక్ వినియోగం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వేకు చెందిన వివిధ విభాగాల అధికారులు డాక్టర్ చెన్నకేశవరెడ్డి, కళ్యాణి, సంతోష్, కెవి.గిరి, సత్యనారాయణ, రామకృష్ణ, మోషిద్దీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే కరప మండలం పెనుగుదురులో పారిశుధ్య కార్మికులకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేసి, కార్మికులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బి.మురళి, జి నానిబాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ సెక్రటరీ చంద్రకళ, ఎఎన్ఎం దేవి, హరినాథ్, మల్లిబాబు, శివ, రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు చెంతనే అక్రమ మట్టి నిల్వాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా పత్తిగొందిలో రోడ్డు చెంతన అక్రమ మట్టి నిల్వాలు వేశారు. పెద్దగుండం వద్ద రహదారి టర్నింగ్‌లో మట్టిని పెద్ద పెద్ద కొండలుగా వేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తి ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రహదారిపై మట్టి ట్రాక్టర్లు, లారీలు రాత్రి సమయంలో తిరగడం వల్ల ప్రజలకు నిద్రా భంగం కలుగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డుపక్కనే గుట్టగా ఉన్న మంటి నిల్వలు

ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అధికారులు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపల్ మేనేజర్‌గా మండపేట నుంచి బదిలీపై వచ్చిన తాతపూడి కనకరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. అలాగే సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్న ఆర్ఓ స్థానంలో పిఠాపురం నుంచి బదిలీపై వచ్చిన కె.శ్యామల ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యను కలిసి జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్, ఆర్ఒలకు ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మేనేజర్ కనకరాజు

ఆర్ఒ శ్యామల

పేదల ఆకలిని తీర్చేందుకే అన్న క్యాంటీన్

ప్రజాశక్తి - కోటనందూరు

పేద ప్రజల ఆకలిని తీర్చేందుకే అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేసినట్లు మండలి సభాపక్ష నాయకుడు యనమల రామకృష్ణుడు అన్నారు. గురువారం తుని మున్సిపల్ పార్కులో అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. క్యాంటీన్‌కు వచ్చిన వారికి ఆయనే అన్నాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లను కొనసాగించలేక రాజకీయ దురుద్దేశ్యంతో మూసివేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సిఎం చంద్రబాబు అన్న క్యాంటీన్ కొనసాగించాలని లక్ష్యంతో మళ్లీ ప్రారంభించడం జరిగిందన్నారు. మారుమూల ప్రాంతాల నుంచి అవసరాల నిమిత్తం వచ్చిన ప్రజలకు అన్న క్యాంటీన్ ఎంత ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్ బాబు , ఇనిగంటి సత్యనారాయణ, మోత్కూరు వెంకటేష్, చింతమనేడు అబ్బాయి, ఎస్ లోవరాజు, కుసుమంచి శోభారాణి, ఎంపిపి బొప్పన రాము, మున్సిపాలిటీ కమిషనర్ ఎ.వెంకటరావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో అన్నం వడ్డిస్తున్న యనమల

ఉత్తమ ఉపాధ్యాయునికి పౌర సన్మానం

ప్రజాశక్తి - కరప

స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జడ్‌పి హైస్కూల్ పూర్వ విద్యార్థి, కాజులూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చింతా నారాయణమూర్తి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న సందర్భంగా పౌర సన్మానం జరిగింది. గురువారం పూర్వ విద్యార్థులు, గ్రామస్తులచే మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ అధ్యక్షతన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కె.బుల్లికృష్ణవేణి, ప్రత్తి సత్యనా రాయణ, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి పాల్గొని ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేయూత ప్రధాన కార్యదర్శి అలీమ్, పెదిరెడ్డి తాతారావు, నాగరాజు, చోడపునీడి రమణ, అనిశెట్టి రామకృష్ణ, కూనపురెడ్డి వీర్రాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు

బ్రాహ్మణ గూడెంలో స్వచ్ఛతాహి సేవా

ప్రజాశక్తి - చాగల్లు

బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ రామచంద్రన్ మాట్లాడారు. మహాత్మా గాంధీ కేవలం స్వాతంత్ర్యాన్నే కాకుండా స్వచ్ఛమైన భారతదేశం, అభివృద్ధిని కూడా ఆకాంక్షించారని గుర్తు చేశారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను సాధించాలన్నారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, రామకృష్ణ, నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర' ముసాయిదాపై వీడియోకాన్ఫరెన్స్

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అమరావతి నుంచి గురువారం వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్వర్ణాంధ్ర @2047 విజన్ ముసాయిదాకు అనుగుణంగా జిల్లా ,మండల స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపకల్పన చేసే అంశాల పై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఐటీ శాఖ ద్వారా వెబ్సైట్లో ప్రదర్శించిన స్వర్ణాంధ్ర @ 2047 విజన్ ముసాయిదా డాక్యుమెంట్ కు అనుగుణంగా గా వివిధ వర్గాల నుండి వివిధ స్థాయిలలో ప్రజాభిప్రాయం సూచనలు సలహాలు సేకరించి పరిగణనలో తీసుకొని జిల్లా మండల యాక్షన్ ప్లాన్ రూపకల్పన పై జిల్లా కలెక్టర్లు దష్టి సారించాలని సూచించారు. ఈ ముసాయిదా డాక్యుమెంట్ ఈనెల 21 నుండి అక్టోబర్ 5 వరకు ఐటీ శాఖ వెబ్సైట్లో ప్రదర్శిస్తారన్నారు. ఈ ముసాయిదా డాక్యుమెంట్ పై ప్రజల నుండి సూచనలు సలహాలు తెలుసుకుని మండల స్థాయిలో యాక్షన్ ప్లాన్ ను ఈ నెలాఖరు నాటికి సిద్ధం చేయాలని అదేవిధంగా జిల్లాస్థాయి లో మండల స్థాయి అంశాలను పొందుపరుస్తూ అక్టోబర్ 15 నాటికి జిల్లా యాక్షన్ ప్లాన్ ను రూపొందించాలన్నారు. స్థానికంగా లభించే వనరులతో, విలువ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధి, ప్రాథమికంగా వ్యవసాయ, పారిశ్రామిక సెక్టార్లు ఉద్యాన, ఆక్వారంగం ఫుడ్ ప్రాసెసింగ్, సామాజిక అభివృద్ధి విద్య, ఉద్యోగాల కల్పన పారామీటర్ల ను పొందుపరుస్తూ జిల్లా యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. జిల్లా కార్యాచరణ ప్రణాళికలను కార్యదర్శులు శాఖల ఉన్నతాధికా రుల సహకారంతో జిల్లా కలెక్టర్లు రూపొందించాలన్నారు. 5 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికల తయారీని ప్రారంభించడం కోసం సిపిఒ ఇతర జిల్లా అధికారులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ముసాయిదాపై నిర్దేశిత సమయాలలో పారిశ్రామిక వేత్తలు, విద్యావేత్తల సమావేశాలను ఏర్పాటు సూచనలు, సలహాలు అభిప్రాయాలు సేకరించాలన్నారు అదేవిధంగా ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో ఎంపీ, ఎంఎల్‌సి, ఎంఎల్ఎ ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సూచనలు సలహాలు సేకరించి క్రోడీకరించాలన్నారు. రైతులు, ప్రముఖులు, ఛాంబర్లు ఇతర సంఘాలతో జిల్లా కలెక్టర్లు సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఇండస్ట్రియల్ ఛాంబర్ అసోసియేషన్లు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఆక్వా సంఘాలు మొదలైన వాటి నుంచి అభిప్రాయాలు సేకరించా లన్నారు. గ్రామ మండల మున్సిపల్ స్థాయి సమావేశాలను నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం ఫీడ్ బ్యాక్ సేకరించాలన్నారు. ఎ తుది ముసాయిదా స్వర్ణాంధ్ర విజన్ @ 2047 డాక్యుమెంట్‌ను సమీక్ష కోసం అక్టోబర్ 22న ముఖ్యమంత్రికి సమర్పిస్తారన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలకమైన అభివృద్ధి అంశాలను చేరుస్తూ , ఆశించిన వృద్ధి రేటును సాధించడానికి అందరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పాల్గొన్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

డెంగీతో చిన్నారి మృతి

ప్రజాశక్తి - శంఖవరం


వనజ(ఫైల్ ఫొటో)

శంఖవరం అంబేద్కర్ నగర్‌కు చెందిన వనజ(3) డెంగీతో గురువారం మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు స్థానిక అంబేద్కర్ నగర్‌లోని ఇందిరమ్మ కాలనీలో ఎమ్మిలి తాతాజీ, శిరీష దంపతులు నివశిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమా రుడు ఉన్నారు. వీరి కుమార్తె వనజక గత ఆది వారం జ్వరానికి గురైంది. సోమవారం రౌతులపూడిలో గల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంటనే వైద్యులు రక్త పరీక్ష చేసి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించాలని సూచించారు. కాకినాడ ఆసుపత్రిలో చిన్నారిని పరీక్షించి డెంగీగా నిర్ధారించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందింది.

అమెరికాలో ఆంధ్ర విద్యార్థి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

ఉన్నత చదువు కోసం అమెరికాకు వెళ్లిన నలజర్ల మండలం ప్రకాశ్‌రావు పాలేనికి చెందిన ముత్తిన రమేష్ మృతి చెందాడు. ఈ వార్తతో గ్రామంలో విషాదం నెలకొంది. రమేష్ 2022లో ఉన్నత విద్యను అభ్యసించడానికి అమెరికా వెళ్లాడు. అప్పటి నుంచి అక్కడే చదువుకుంటున్నాడు. గత ఆదివారం స్నేహితులతో కలిసి బయటికి వెళ్లి వచ్చాడు. గురువారం అతని గది నుంచి దుర్వాసన రావడంతో చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గదిలో కుళ్లిన రమేష్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు వారు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రాథమిక విద్యా స్థాయి నుంచి విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు అన్నారు. గురువారం స్థానిక మహారాణి కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలలో చదివే బాలురకు క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంఇఒ ఇ.ప్రభాకర్‌శర్మ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని, ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపుదల చేసేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అశోక్‌కుమార్, కూటమి నాయకులు విత్తనాల వెంకటరమణ, పొలమరశెట్టి సత్తిబాబు, సరోజ, సతీష్ పాల్గొన్నారు.

బాణసంచా ఉత్పత్తి కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామ శివరున ఉన్న హారిక ఫైర్ కేంద్రాన్ని గురువారం పోలీస్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వాహణకు తీసుకున్న అనుమతి పత్రాలను పరిశీలించారు. ఉత్పత్తి కేంద్రం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులకు సూచించారు. పనిలో ఉన్న కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివనాగు, డిప్యూటీ తహశీల్దార్ దివ్యభారతి, విఆర్ఒ కృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3 లక్షలతో ఊయల మండపం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామ దేవత మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో రూ.3 లక్షలతో ఊయల మండపం ఏర్పాటు చేశారు. తీర్థ మహోత్సవాలలో భాగంగా గురువారం ఊయల సేవ నిర్వహించారు. చెక్క కామరాజు కుమారుడు చెక్క చిన్న కామేశ్వరరావు తన తాతయ్య చెక్క దేసియ్య, తన తమ్ముడు చెక్క చిట్టిబాబు జ్ఞాపకార్థం సుమారు రూ.1.65 లక్షలతో ఊయల మండపం, చెక్క ఊయలను రూ.62 వేలతో నిర్మించారు. ఈ ఊయలకు కర్రి మీరా సాహెబ్, సూర్యకాంతం కుమారులు రూ.30 వేలతో గొలుసును సమకూర్చారు. ఈ పూజా కార్యక్రమంలో చెక్కా కామేశ్వరరావు, రాము దంపతులు, కర్రి ఆదినారాయణ, అనురాధ దంపతులు పాల్గొని పూజలు చేశారు.

ఊయలను సమకూర్చిన దాత కుటుంబీకులు

భీమన్న రచనలతో ప్రజల్లో చైతన్యం

ప్రజాశక్తి-మామిడికుదురు

డాక్టర్ బోయి భీమన్నతన రచనలతో ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చారని అప్పనపల్లి హైస్కూల్ హెచ్ ఎం.బావరాజు సూర్యప్రకాశరావు అన్నారు మామిడికుదురు మానవ వనరుల కేంద్రంలో సహదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో గురువారం మహాకవి భీమన్న జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భీమన్న రచనలు పఠనం చేసి కవి సమ్మేళన నిర్వహించారు. కార్యక్రమం లో ఉపాధ్యక్షులు చెరుకూరి సూర్యనారాయణ శర్మ, కార్యదర్శి ఏడిద కవీంద్ర, గాదరాడ రవిచంద్ర, కందాల వెంకటేశ్వరరావు, కొక్కిరి గడ్డ లక్ష్మణరావు, మాగాపు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు

జైలును సందర్శించిన జడ్జి ప్రకాష్‌బాబు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు కేంద్ర కారాగారాన్ని గురువారం సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, ఇతర సదుపాయాలను పరిశీలించారు. కారాగారంలోని ఖైదీలతో మాట్లాడారు. వారి తరపున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, 'బెయిల్ పిటీషన్లు, హైకోర్టుల్లో అప్పీలు వెయాలన్నా, మరే ఇతర న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందని తెలిపారు. ఇందుకోసం సంస్థ నియమించిన పారా లీగల్ వాలంటీర్ల ద్వారా తమ అర్జీలను అందించాలని సూచించారు.

ప్రకటన

మా క్లయింటు విశాఖజిల్లా, చీడిపాలెం, సింగవరం ఐ.టి.డి.ఎ. కాలనీ కాపురస్తురాలు (లేటు) **బొబ్బిలి స్వామినాయుడు గారి భార్య దుంపా సుజ్ఞాన బాయమ్మ గారు** మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా

మా క్లయింటు కాకినాడ జిల్లా, కాకినాడ జగన్నాధపురం కాపురస్తులు బచ్చు చంద్రశేఖర్ మరియు వీరి భార్య బచ్చు నాద స్వరూపగార్ల కుమారుడు బచ్చు భువన కృష్ణ దరహాస్ వయస్సు 14 సంవత్సరములు. మా క్లయింటు చిన్నతనములోనే 15-2-2013లో హిందూ ధర్మశాస్త్ర ప్రకారం నాలుగు సంవత్సరముల వయస్సులో దత్తత తీసుకునుట జరిగి ఉన్నది. అప్పటి నుండి మా క్లయింటు యొక్క సంరక్షణలో ఉన్నాడు. అయితే మా క్లయింటుకు సంబంధించిన ఏవత్తు చర స్థిరాస్తులకు దత్తత కుమారుడు అయిన దుంపా (బచ్చు) కృష్ణ దరహాస్ ముఖ్య వారసుడని (అపురస కుమారునికి ఎట్టి హక్కులు కలుగునో అట్టివి అన్నియూ మాక్లయింటు దత్తత కుమార్డుకు చెందగలవని) ఏవన్మందికి ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది. సదరు దత్తత స్వీకారమును చట్టబద్ధతగా తెలియపరచడమైనది సదరు దత్తత స్వీకారముకు చట్ట బద్ధతగా ది. 24-8-2024 ఉభయులు మా క్లయింట్ మరియు దత్తత కుమారుడి తల్లి, తండ్రి అంగీకరించి ది. 24-8-2024 రిజిష్ట్రీ కూడా చేసియున్నారు.

కాకినాడ
18-9-2024

A. Nagaraju, Venkat R.N.
Advocates, Kakinada

మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి వారి కోర్టులో

D.O.P.No.136/2023

Between

రాయుడు నాని ... పిటీషనర్

మరియు

రాయుడు సునీత .... రెస్పాండెంట్

To

రాయుడు సునీత
W/o. రాయుడు నాని, డో.నెం.62-4-23/2,
ఆకాశపువారి వీధి, జె.రామారావుపేట,
కాకినాడ

పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపియున్నప్పటికీ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.25-9-2024 తేదీ నాటికి వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు ఆరోజున పై కోర్టువారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలియపరచు కోగలరు. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

By Court Order

కె.శంకుసింగ్, అడ్వకేట్,
డోర్‌నెం. 27-5-2, బుద్ధవరపు వారి వీధి
మసీదు వెనుక, కాకినాడ.
సెల్: 9848164808

కాకినాడ
18-9-2024

ర్యాలీని ప్రారంభిస్తున్న మునిస్వామి

యానాం వార్తలు

స్వచ్ఛతాహీ సేవపై విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా డ్రీమ్స్ విద్యార్థులు గురువారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలన అధికారి ఆర్.మునిస్వామి పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అలాగే నెహ్రూ యువ కేంద్ర, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్లు కళాశాల ఆవరణను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర యువజన జిల్లా అధికారి తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్ రీజనల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

21న తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

యానాం రక్షిత మంచినీటి సరఫరా విభాగంలో నిర్వహణ పనులు జరుగుతున్నందున ఈ నెల 21న సాయంత్రం పలు ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదని ప్రజాపనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కాళ్ళ నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా మెట్టకూరు, గోపాల్‌నగర్, అంబేద్కర్ నగర్, ఫ్రాన్సుతిప్ప, కురసాంపేట ప్రాంతాల వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

సహారా చెల్లింపులను తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తక్షణమే కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న సహారా నిధులు రూ.25 వేల కోట్లను చెల్లింపులు చేయాలని సహారా ఏజెంట్లు కోరారు. గురువారం సుంకరపాలెం, కాకినాడ, తాడేపల్లిగూడెం, గోకవరం, రాజమహేంద్రవరం, పెద్దాపురం బ్రాంచ్‌లకు చెందిన ఏజెంట్లు వడ్డి ఏడుకొండలు, కె.అప్పారావు, సత్యనారాయణ, డి.శ్రీనివాస్, రవిబాబు, ప్రభావతి ఆధ్వర్యంలో ఎంపీ హరీష్‌మాధుర్‌ను అమలాపురంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ వర్కర్స్‌కు, సహారా ఇండియా ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలను ఆయనకు వివరించారు. సహారా ఇండియా బకాయిలు రాక అనేక కుటుంబాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు వడ్డి ఏడుకొండలు తెలిపారు.

లింకు దస్తావేజు పోయినది

ఒమ్మి సుజాత, W/o.సత్యనారాయణ, డో.నెం. 73-9-2/2, వెంకట రామయ్య నగర్, 4వ వీధి, నారాయణపురం, రాజమండ్రి అర్బన్‌లో నివసిస్తున్న నా ఆస్తి తాలూకు నా పేరున గల **ఒరిజినల్ లింక్ దస్తావేజు నెం. 5536/2004, Dt. 30-7-2004, SRO,** రాజమండ్రి నెంబరు గల లింకు దస్తావేజు **ది. 02-9-2024వ తేదీన** రాజమండ్రి పేపర్ మిల్లు వద్ద జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా పడిపోయినది. కనుక ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

ఒమ్మి సుజాత
డో.నెం. 73-9-2/2, వెంకటరామయ్య నగర్
4వ వీధి, నారాయణపురం, రాజమండ్రి
తూ॥గో॥జిల్లా, సెల్: 9491118551

మహారాజశ్రీ ముమ్మిడివరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. No. 110/2019

Between:

గొలకోటి శ్రీనివాసరావు -వాది

AND

దార్ల శ్రీకృష్ణమూర్తి (died),
వీధి రజని, D/o. late శ్రీకృష్ణమూర్తి, హిందువు, హౌస్ వైఫ్, 39 సం॥లు, తాటిపాక, రాజోలు మండలం.
-4వ ప్రతివాది

యీ నెంబరు దావాలో వాది వద్ద మీ తండ్రి గారు అయిన (లేటు) దార్ల శ్రీకృష్ణమూర్తి (1వ ప్రతివాది) ది. 8-8-2017 సం॥రం తేదీన నగదు అప్పుగా తీసుకొని ప్రాంశరీ నోటు వ్రాయించి యిచ్చినారు. 1వ ప్రతివాది అయిన మీ తండ్రి (లేటు) దార్ల శ్రీకృష్ణమూర్తి పై వాది యీ దావా దాఖలు చేసినారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించిననూ తీసుకొనచున్నందున **ది. 20-09-2024న వాయిదా తేదీ అని 4వ ప్రతివాది అయిన మీకు తెలియచేయడమైనది. వాయిదా తేదీన మీరు ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరయి ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని యిందు మూలంగా మీకు తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వాయిదా తేది: 20-09-2024

చింతపల్లి అజయ్‌కుమార్
అడ్వకేటు, ముమ్మిడివరం
సెల్: 9849864699

ముమ్మిడివరం
15-9-2024

In the Court of the Civil Judge, Senior Division, Amalapuram

I.A No. 623/2021 / O.S.NO 64/2019

Between:

Dasireddy Veera Raghavulu S/o Mutyalu Aged 81 years, Agriculture Hindu, R/o D.No.2-26-1, Pappulavari Palem P. Gannavaram Mandalam, Dr.B.R.A.Konaseema District pin:533229
...Petitioner/ Plaintiff

AND

Beera Anasuya (late) W/o Pallayya (వగైరాలు)

D-3: Beera Srinivasa Rao S/o Pallayya Aged about 50 years D.No.3-53, Dan Center, Papppurlavari palem P. Gannavaram Mandala, Dr.B.R.A.K District 533229

D-4: Beera Sri Ram Murthy S/o Pallayya Aged about 48years -DO-

D-5: Salladi Raja Lakshmi D/O Pallayya Aged about 54 years -DO-

D-6: Petta Bharati D/O Pallayya Aged about 52 years -DO- *...Defendants*

పై నెంబరు దావాలో మూడవ ప్రతివాది నుండి 6వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు నోటీసులు పంపించినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు నిమిత్తం **ది. 25-09-2024 సం॥ తేదిన వాయిదా వేసినారు మీరు ఆ రోజున ఉదయం గం॥ 10-30 ని॥లకు** స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడుననీ రూఢీగా తెలియపరచడమైనది.

సయ్యద్ హమీద్ పాషా
అడ్వకేట్, అమలాపురం
సెల్: 9490786161

అమలాపురం
19-09-2024